
సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 24 | జూన్ | 2023



డెల్టాలకు 5,730 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



సత్యదేవుని దేవేరికి వజ్రకిరీటం

రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవారు త్వరలో వజ్రకిరీటాలంకరణలో భక్తులను అనుగ్రహించనున్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం

34.0° / 25.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	32.0	25.5
కాకినాడ	30.0	26.9
అమలాపురం	34.0	26.0

న్యూస్‌రీల్

ప్రతిపక్షాలవి పస లేని అబద్ధపు ప్రచారాలు

- మంత్రి చెల్లుబోయిన వేణు



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: రాష్ట్రంలో ప్రతిపక్షాలు పస లేని అసత్య ప్రచారాలను వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓడిపోతామనే భయంతోనే సానుభూతి కోసం కొడుకు లోకేష్‌తో చంద్రబాబు పాదయాత్ర చేయిస్తున్నారని విమర్శించారు. భాష రాని లోకేష్ ప్రతి మాటలోనూ తొట్రుపాటుకు గురవుతున్నారని, ఆయన పాదయాత్ర ఫ్లాప్ అయ్యిందని అన్నారు. దీంతో వారాహి యాత్ర పేరుతో పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు రంగంలోకి దింపారన్నారు. చంద్రబాబు సంపద సృష్టికర్తంటూ ఆ పార్టీ నేతలు బీరాలు పోతూంటారని, అలా అయితే ఆయన పాలన ముగిసే నాటికి రాష్ట్ర అప్పు రూ.3.80 లక్షల కోట్లకు ఎలా పెరిగిందో చెప్పాలని మంత్రి వేణు అన్నారు. తన హయాంలో రూ.2.60 లక్షల కోట్ల అప్పులు చేసిన చంద్రబాబు సంపద సృష్టికర్త ఎలా అవుతాడో ఆ పార్టీ నేతలే చెప్పాలని డిమాండ్ చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల జీవితాలను తాకట్టు పెట్టడంతో పాటు ఓటుకు రూ.కోట్లు కేసుతో రాత్రికి రాత్రే హైదరాబాద్ వదిలిపెట్టిన వ్యక్తి చంద్రబాబు అని మంత్రి వేణు మండిపడ్డారు. 'పవన్ కల్యాణ్ ఒక రోజు నేనే సీఎం అంటారు. మరోసారి నేను సీఎం ఎలా అవుతాను అంటారు. ఒకసారి మద్యపాన నిషేధం చేయడం అసాధ్యమంటారు. మరోసారి చేయలేదంటారు. ఇలా స్థిరత్వం లేని మాటలతో పస లేని ఆరోపణలు చేస్తున్నారు' అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం పౌర జీవనానికి శ్రీరామ రక్ష కానుందని మంత్రి వేణు పేర్కొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు అభినందన

అమలాపురం రూరల్: నీట్‌లో ఆలిండియా 721వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని మద్దాల దేవీ శిరీషను కలెక్టర్ హిమాన్షు శుక్లా తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు.

ఎన్‌రోల్‌మెంట్ నూరు శాతం చేయాలి

- పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి. వేదికపై డీఈఓ కమలకుమారి తదితరులు

ముమ్మిడివరం: నూతన విద్యా సంవత్సరంలో నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ చేపట్టాలని పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఆదేశించారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో ముమ్మిడివరం జిల్లా విద్యాశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరాన్ని సక్రమంగా, సమర్థంగా నిర్వహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. వారికి ఈ నెల 26 నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓ-1, ఎంఈఓ-2లు పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. అకడమిక్ గైడెన్స్ ప్రకారం పాఠశాలలో పాఠ్యాంశాలను సకాలంలో పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు వర్క్ బుక్‌లు, నోట్స్ కరెక్షన్ చేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమల కుమారి తొలుత జిల్లా విద్యాప్రగతిని వివరించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ మాట్లాడుతూ, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, అకడమిక్ క్యాలెండర్‌ను పాటించాలని, అధికారులు ఎప్పుడు సందర్శనకు వచ్చినా అన్ని అంశాలూ క్రమబద్ధంగా ఉండాలని ఆదేశించారు. పదో తరగతి ఫలితాల్లో మంచి ఫలితాలకు కృషి చేసిన డీఈఓ కమల కుమారి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ, డీవైఈఓ సాలెంరాజు, డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, ఏఎస్ఓ తాతారావులను ఆర్‌జేడీ నాగమణి సత్కరించారు. ఈ సమావేశంలో సెక్టోరియల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద రుతురాగాలు



- తొలకరి వర్షాలతో సేద తీరుతున్న ఉమ్మడి తూర్పు
- నెల రోజుల పాటు ఠారెత్తించిన ఎండలు
- ప్రస్తుతం చల్లబడిన వాతావరణం
- సేద తీరుతున్న సామాన్యులు
- ఖరీఫ్ సాగుకు ఊతం



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రులో దమ్ము చేస్తున్న రైతు

సాక్షి, అమలాపురం: చండప్రచండంగా చెలరేగి, నిప్పులు కురిపించిన సూర్యుడు ఎట్టకేలకు శాంతించాడు. నైరుతి రుతుపవనాలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో చిరు జల్లులతో పాటు ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. చినుకు జాడ లేక నెర్రెలు బారిన పుడమి తల్లి.. తొలకరి చినుకులు తాకడంతో పులకరిస్తోంది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మండిన ఎండలతో దాదాపు నెల రోజుల పాటు ఉక్కిరిబిక్కిరి అయిన సామాన్యులు.. మారిన వాతావరణంతో సేద తీరారు. మరోవైపు ఖరీఫ్ వరి సాగుకు ఊతమివ్వడంతో పాటు ఉద్యాన, కూరగాయ పంటలకు ఈ వర్షాలు దోహదపడుతున్నాయి.



సఖినేటిపల్లి మండలం ఉయ్యూరివారి మెరక గ్రామంలో కురుస్తున్న వర్షం

బిపర్‌జోయ్ బ్రేకులు

మృగశిర కార్తె పూర్తవుతున్న సమయంలో నైరుతి రుతు పవనాలు ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించాయి. ఇరవై రోజుల క్రితం రాయలసీమతో పాటు శ్రీహరికోట వద్దకు రుతుపవనాలు చేరుకున్నాయి. వీటికి అదే సమయంలో అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపర్‌జోయ్ తుపాను బంధనాలు వేసింది. దీంతో రుతుపవనాలు కదలక మెదలక అక్కడే నిలిచిపోయాయి. ఆ తుపాను తీరం దాటిన తరువాత ఎట్టకేలకు రుతుపవనాలు ముందుకు కదిలాయి. తూర్పు గోదావరి జిల్లాలో మూడు రోజుల క్రితమే తొలకరి జల్లులు పడగా, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోకి శుక్రవారం ప్రవేశించాయి. రుతు పవనాల ప్రభావంతో కోనసీమలోని రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకూ అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలతో పాటు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైంది.

ఠారెత్తించిన ఎండలు

రోహిణీ కార్తె సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అనంతరం ఉష్ణోగ్రతలు తీవ్రరూపం దాల్చాయి. మృగశిర కార్తెలో వర్షాలు కురవాల్సి ఉండగా.. ఆ సమయంలో కూడా రోహిణి స్థాయికి మించి మరీ ఎండలు ఠారెత్తించాయి. రాజమహేంద్రవరంలో మే 15న రికార్డు స్థాయిలో 48.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగత నమోదు కాగా.. ఈ నెల 16న కూడా మరోసారి అదే స్థాయిలో 48.5 డిగ్రీలు నమోదైంది. అదే రోజు కాకినాడ జిల్లా సామర్లకోటలో 46.8, తునిలో 46.4, కోటనందూరులో 45.51, తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలో 46.05, గోకవరం 46.04, కోనసీమ జిల్లా ఈతకోట, అమలాపురంలో 45 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల మొదటి వారం నుంచి పదిహేను రోజులకు పైగా 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు, ఉక్కపోత వాతావరణంతో సామాన్యులు అల్లాడిపోయారు.

చల్లబడిన వాతావరణం

రుతుపవనాల రాకతో వాతావరణం మారడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. రాజమహేంద్రవరంలో శుక్రవారం 32, కాకినాడలో 34.9, అమలాపురంలో 31 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం తగ్గుముఖం పట్టి, 25.5 నుంచి 26.9 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

జోరందుకోనున్న సాగు

ఉమ్మడి జిల్లాలో గోదావరి డెల్టాతో పాటు ఏలేరు రిజర్వాయర్, గోదావరి ఎత్తిపోతల పథకాల దిగువన తూర్పు గోదావరి జిల్లా రాజానగరం, కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలాల్లో ముందస్తు సాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా మూడు డెల్టా కాలువలకు, ఎత్తిపోతల పథకాలకు నీరు విడుదల చేశారు. అనంతరం ఎండలు మండిపోవడంతో నారు వేసేందుకు రైతులు వెనకడుగు వేశారు. దీంతో ఆశించిన స్థాయిలో ముందస్తు సాగు జరగలేదు. ఇప్పుడు వాతావరణం చల్లబడటం, వర్షాలు కురుస్తుండటంతో సాగు పనులు జోరందుకోనున్నాయి. తీవ్రమైన ఎండలకు కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్, పోక (వక్క) వంటి ఉద్యాన పంటలతో పాటు కూరగాయ పంటలు వాడిపోయాయి. ఇవన్నీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, చల్లబడిన వాతావరణంతో తేరుకుంటున్నాయి.

టెన్త్ సప్లిమెంటరీలో బాలికలదే పైచేయి

జిల్లాలో సప్లిమెంటరీ పరీక్షలు

రాసిన వారు : 5,773

బాలురు: 3,481

ఉత్తీర్ణులు : 2,763 (79.37 శాతం)

పరీక్షకు హాజరైన బాలికలు: 2,292

ఉత్తీర్ణులు: 1,929 (84.16 శాతం)

మొత్తం ఉతీర్ణులు: 4,692 (81.27 శాతం)

రాయవరం: పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. వీటిలో బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 81.27 శాతం ఫలితాలతో మన జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. ఈ నెల 2 నుంచి పదో తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. జవాబు పత్రాల మూల్యాంకనాన్ని 13, 14 తేదీల్లో నిర్వహించారు. సెలవుల్లో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ తెలిపారు. సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాన్ని సులభతరం చేసేందుకు మార్కుల జాబితాలను నాలుగు రోజుల్లో అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో ఉంచుతారు. ఉత్తీర్ణులైన వారందరికీ నిర్ణీత సమయంలో పదో తరగతి సర్టిఫికెట్లను సంబంధిత పాఠశాలలకు పంపించనున్నారు. జవాబు పత్రాల రీకౌంటింగ్ కోరుకునే విద్యార్థులు ఈ నెల 29వ తేదీలోగా సబ్జెక్టుకు రూ.500 చొప్పున సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలానా ద్వారా చెల్లించాలి. జవాబు పత్రాల ఫొటో కాపీకి దరఖాస్తు చేసుకునే వారు సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలానా ద్వారా ప్రతి సబ్జెక్టుకు రూ.1,000 చొప్పున ఈ నెల 29లోగా చెల్లించాలి.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

అందుకే 'జగనన్న సురక్ష' : కలెక్టర్ హిమాన్షు శుక్లా



జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కొండేటి, ఎమ్మెల్సీలు కుడుపూడి, ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం రూరల్: ప్రజా సమస్యలను సంతృప్తకర స్థాయిలో పరిష్కరించడం, ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ఈ లక్ష్యాలతో శనివారం నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, సుస్థిరమైన, మంచి సమాజ నిర్మాణానికి, ఉమ్మడి ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్షను పటిష్టంగా అమలు చేస్తామన్నారు. అనంతరం అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, తొలి దశలో గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది శనివారం నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటినీ సందర్శించి అర్హత ఉన్నా ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోవడం లేదా ఏవైనా సమస్యలు, వివిధ రకాల సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు తదితర అంశాలను నిశితంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం వచ్చే నెల 1 నుంచి గ్రామ/వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక క్యాంపుల్లో వివిధ సేవలు, ధ్రువపత్రాలను ఉచితంగా అందించాలని తెలిపారు. మండలాల వారీగా ఎంపీడీఓ, తహసీల్దార్ ఆధ్వర్యాన రెండు బృందాలను ఈ ప్రత్యేక క్యాంపుల నిర్వహణకు ఏర్పాటవుతున్నాయన్నారు. వీటిల్లో ముగ్గురు చొప్పున మండల స్థాయి అధికారులుంటారని, అవసరమైతే మూడో బృందం ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. ఏ రోజు ఏ సచివాలయం వద్ద క్యాంపు నిర్వహిస్తున్నారో ముందుగానే అందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియలో వలంటీర్లు కీలక భూమిక పోషించాలని కలెక్టర్ సూచించారు. వలంటీర్లు గ్రామ సచివాలయానికి వెళ్లి సంబంధిత పత్రాలు సమర్పించి, టోకెన్ నంబర్, సర్వీస్ రిక్వెస్ట్ నంబరు తీసుకొని, ఆ టోకెన్‌ను కూడా ఆయా వలంటీర్లతో కూడిన టీమ్ తీసుకువెళ్లి ప్రజలకు ఇంటి వద్దనే అందించాలన్నారు. ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువపత్రా లు, మ్యుటేషన్లు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌లో మొబైల్ నంబర్ నమోదు, కౌలు రైతులకు పంట రుణ అర్హత గుర్తింపు కార్డులు, వివాహ ధ్రువీకరణ పత్రాల వంటివి ఉచితంగా ఇస్తారని కలెక్టర్ శుక్లా వివరించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, జాయింట్ కలెక్టర్ హెచ్ఎం ధ్యానచంద్ర, దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పిల్లలను ఆటల్లో ప్రోత్సహించాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్‌తో కలిసి ఒలింపిక్ రన్ ప్రారంభం



క్రీడాజ్యోతితో కలెక్టర్ శుక్లా, సాత్విక్ సాయిరాజ్ తదితరులు

అమలాపురం రూరల్: ఆటలు ఆడే విధంగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక ఆఫీసర్స్ క్లబ్ వద్ద శుక్రవారం ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. ఒలింపిక్ క్రీడాజ్యోతిని కలెక్టర్‌తో పాటు, అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సాత్విక్ మాట్లాడుతూ, పిల్లలు క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మెట్ల వెంకట సూర్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా క్రీడాకారులు, క్రీడాభిమానులు ఒలింపిక్ రన్‌లో పాల్గొన్నారు. అందరూ ఒలింపిక్ క్రీడాజ్యోతిని పట్టుకొని గడియార స్తంభం సెంటర్ వరకూ రన్ నిర్వహించారు. అందరూ ఆటలు ఆడాలి.. అందరూ ఆరోగ్యంగా ఉండాలి, వ్యాయామం చేయండి.. వ్యాధులకు దూరంగా ఉండండి, పరుగెడదాం.. పరుగెడదాం.. ప్రగతిని సాధిద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, జిల్లా చీఫ్ కోచ్ సురేష్‌కుమార్, డాక్టర్ గొల్లకోటి రంగారావు, రిటైర్డ్, ప్రస్తుత వ్యాయామోపాధ్యాయులు, కోచ్ రవణం మాధవి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఒలింపిక్ రన్ సర్టిఫికెట్లు అందజేశారు.

వాస్తవ పరిస్థితులను బట్టి గిట్టుబాటు ధర



సీఏసీపీ సమావేశంలో పాల్గొన్న రామారావు, త్రినాథరెడ్డి

- తడిసి, రంగుమారిన ధాన్యానికి ప్రత్యేక రేటు నిర్ణయించాలి
- సీఏసీపీ సమావేశంలో అగ్రి మిషన్ సభ్యుడు రామారావు

అల్లవరం: రైతుల వాస్తవ పరిస్థితులను బట్టి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు జున్నూరి రామారావు సూచించారు. కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (సీఏసీపీ) దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రతినిధులతో శుక్రవారం విశాఖపట్నంలో సమావేశం నిర్వహించారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, ఏపీ వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన 2024-25 మార్కెట్ సీజన్‌కు సంబంధించి జరిగిన ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి జున్నూరి రామారావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి పాల్గొన్నారు. సీఏసీపీ చైర్మన్ విజయపాల్‌శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రామారావు మాట్లాడుతూ, గ్లోబర్ వార్మింగ్ ప్రభావంతో అకాల వర్షాలు కురిసి ఏపీ రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అకాల వర్షాలకు తడిసి, రంగు మారిన ధాన్యాన్ని మిల్లర్లు, వ్యాపారులు కొనుగోలు చేయక తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. వాస్తవ పరిస్థితులను బట్టి నిబంధనలు సడలించి, కచ్చితమైన ధర నిర్ణయించాలని, తడిసి, రంగు మారిన ధాన్యానికి ప్రత్యేక ధర నిర్ణయించాలని కోరారు. ఉత్పత్తి వ్యయానికి తగినట్టుగా గిట్టుబాటు ధర పెంచడంపై ఆలోచించాలన్నారు. త్రినాథరెడ్డి మాట్లాడుతూ, అన్ని రాష్ట్రాల్లోనూ ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని, దాని ఆధారంగా సగటు ధర నిర్ణయిస్తున్నారని, దీనివలన ఏపీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఏపీలో అకాల వర్షాలు, తుపాన్ల ప్రభావం ఎక్కువగా ఉంటోందన్నారు. ఏపీ ప్రజల కోసం నష్టాన్ని భర్తీ చేయాలని కోరారు.

దివ్యాంగ పింఛన్లపై వక్రీకరించకండి

- వారికి జగన్ ప్రభుత్వంలో ఎన్నో పథకాలు
- జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు మానాలి
- జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు

అమలాపురం టౌన్: దివ్యాంగులకు గుర్తింపుతో కూడిన అన్ని పథకాలూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే అమలవుతున్నాయని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వంటిద్దు వెంకన్నాయుడు, సంఘం జిల్లా కార్యవర్గ ప్రతినిధులు స్పష్టం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మెప్పు కోసం వాస్తవాలను దాచి పెట్టి, వక్రీకరించి మాట్లాడడం మానుకోవాలని ఆ పార్టీ నేతలకు హితవు పలికారు. ఈ మేరకు వెంకన్నాయుడు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగవరపు పరశురాముడు, కార్యదర్శి సుంకర సత్యదుర్గ, ఉపాధ్యక్షుడు బొంతు శ్రీనివాస్, కోశాధికారి అయితాబత్తుల సురేష్ తదితరులు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో జనసేన నాయకుడి ఆరోపణలను ఖండించారు. దివ్యాంగులైన తమ ఇద్దరు పిల్లలు పవన్ కల్యాణ్‌ను చూడాలనడంతో వారిని ఆయన వద్దకు తీసుకువెళ్లామని అమలాపురం రూరల్ చిందాడగరువుకు చెందిన వారి తల్లి చెబుతోందని పేర్కొన్నారు. తీరా అక్కడకు వెళ్లిన తర్వాత.. ఒక ఇంట్లో ఇద్దరు దివ్యాంగులుంటే ఒకరికే పింఛన్ వస్తోందని, ప్రభుత్వం ఇలానే దుర్మార్గంగా పింఛన్లు తీసేస్తోందంటూ పవన్ కల్యాణ్‌కు జనసేన నాయకుడు మోటూరి వెంకటేశ్వరరావు చెప్పారని వివరించారు. అయితే ఆ కుటుంబంలోని ఇద్దరు పిల్లలకూ దివ్యాంగ పింఛన్లు వస్తున్న విషయాన్ని విస్మరించి, ఆ పార్టీ నాయకుడు అలా మాట్లాడటం సరికాదని అన్నారు. తన ఇద్దరు పిల్లలకూ ప్రతి నెలా దివ్యాంగ పింఛన్లు వస్తున్నాయంటూ ఆ తల్లి సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోలో చెప్పిందని తెలిపారు. పవన్ కల్యాణ్‌ను పిల్లలు చూస్తానంటే తీసుకు వెళ్లగా, ఆ పార్టీ నాయకుడు వెంకటేశ్వరరావు తమ మధ్యలోకి వచ్చి పింఛన్లు సరిగ్గా అందడం లేదని, ఒకరికే పింఛన్ వస్తోందంటూ చెప్పారని ఆ తల్లి చెప్పడంతో వాస్తవం వెలుగు చూసిందని దివ్యాంగ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రతి నెలా ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి పింఛన్లు అందించే ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగన్ పైన, ఆయన ప్రభుత్వం పైన తప్పుడు ప్రచారం చేయడం ఎంత మాత్రం తగదని జనసేన నాయకులకు వెంకన్నాయుడు హితవు పలికారు.

రత్నగిరి.. భక్త జనసిరి

సత్యదేవుని దర్శించిన 25 వేల మంది భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని శుక్రవారం 25 వేల మంది భక్తులు దర్శించి, పూజలు చేశారు. వ్రతాలు 1,500 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా సత్యదేవుని జన్మనక్షత్ర పూజలు

జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా రత్నగిరి వాసుడు సత్యదేవునికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పండితులు తెల్లవారుజామున రెండు గంటలకు ఆలయం తెరచి ప్రత్యేక పూజలు చేశారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరుల మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకూ యాగశాలలో సత్యదేవునికి ఆయుష్య హోమం నిర్వహించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టింశివ, యనమండ్ర శర్మ, ఇంద్రగంటి నరసింహమూర్తి తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

నాణ్యమైన విత్తనం.. నమ్మకమైన దిగుబడి

పాడి-పంట



- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు
- విత్తనాల ఎంపికే కీలకమంటున్న వ్యవసాయాధికారులు
- అందుబాటులో నాణ్యమైన రకాలు





బి.బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి

కొత్తపేట: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి. విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా లేకపోతే కొంత మంది వ్యాపారులు నాణ్యత లేని విత్తనాలు అంటగట్టే అవకాశం ఉంటుంది. రైతులు నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యంలో వారు నకిలీలతో మోసపోకుండా రైతుభరోసా కేంద్రాల(ఆర్‌బీకే)కు ఇప్పటికే నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసింది. సాగులో విత్తనాల ఎంపికే కీలకమని, దీంతో పాటు కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయ అధికారి బి.బోసుబాబు సూచిస్తున్నారు.

నాణ్యతను గుర్తించాలిలా..

- విత్తనాలు బ్రీడర్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రూత్‌ఫుల్ లేబుల్స్‌లో లభిస్తాయి. వీటిని సాగు చేసి, మళ్లీ విత్తనాలుగా వినియోగించుకోవచ్చు. దీనివలన రైతులకు విత్తన భారం తగ్గుతుంది.
- బ్రీడర్ విత్తనాన్ని విత్తన పరిశోధన స్థానాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విత్తన కంపెనీల శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ ఉంటుంది. ఈ విత్తనాల ధర కాస్త ఎక్కువ. దుకాణాల్లో విరివిగా లభ్యం కావు.
- బ్రీడర్ సీడ్ నుంచి ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి చేస్తారు. సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో వివిధ విత్తన ఉత్పత్తి సంస్థలు వీటిని పండిస్తాయి. ఫౌండేషన్ విత్తనానికి తెలుపు రంగు ట్యాగ్ ఉంటుంది.
- ఫౌండేషన్ సీడ్ నుంచి వచ్చే విత్తనాన్ని సర్టిఫైడ్ సీడ్ అంటారు. దీనికి నీలం రంగు ట్యాగ్ వేస్తారు.

ఆయా జిల్లాల్లో వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)

జిల్లా పేరు	విస్తీర్ణం
తూర్పు గోదావరి	1,94,642
కాకినాడ	2,27,000
కోనసీమ	1,83,000

- సర్టిఫైడ్ సీడ్ నుంచి వచ్చే విత్తనాన్ని ట్రూత్‌ఫుల్ సీడ్‌గా వ్యవహరించి, దీనికి ఆకుపచ్చ ట్యాగ్ వేస్తారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- వ్యవసాయ శాఖ వద్ద అనుమతి పొందిన అ. దీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు సమయంలో తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకూ జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.
- బిల్లుపై విక్రయదారు పేరు, రాష్ట్ర అమ్మకం పన్ను నంబర్, నికర తూకం, నికర ధర, లాట్ నంబర్, విత్తన రకం, గడువు తేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ లూజు (విడి), గడువు దాటిన విత్తనాలు కొనుగోలు చేయరాదు.
- కొనుగోలు చేసిన వెంటనే విత్తనాలను పరీక్షించి మొలక శాతం పరిశీలించాలి.
- మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

నకిలీల కట్టడికి ప్రభుత్వం చర్యలు

నకిలీ విత్తనాల విక్రయంపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ, రైతులను మోసం చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కలెక్టర్లు, వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నాణ్యత లేని, నకిలీ విత్తనాలను అరికట్టడంలో భాగంగా ప్రభుత్వమే ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తోంది. ధర తక్కువని ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా రైతుల్లో అవగాహన పెంచుతోంది.

స్వర్ణకు ప్రత్యామ్నాయంగా కర్షక మిత్ర

ఖరీఫ్‌లో ఎంటీయూ-7029 (స్వర్ణ), ఎంటీయూ-1064 (అమర), ఎంటీయూ-1061 (ఇంద్ర), ఎన్ఎల్ఆర్-34449 (నెల్లూరు సన్నాలు), ఆర్‌జీఎల్-2537 (రాగోలు సన్నాలు), బీపీటీ-5204 (సాంబ మసూరి) రకాలు సాగు చేయాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రైతులు 80 శాతం స్వర్ణ రకం సాగు చేస్తున్నారు. అయితే ఇది అధిక వర్షాలు, తుపాన్లకు పడిపోతూండటంతో రైతులు నష్టపోతున్నారు. అందువలన దీని స్థానంలో మార్టేరు వరి పరిశోధన స్థానం విడుదల చేసిన ఎంటీయూ-1318 (కర్షక మిత్ర) రకంపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. దీనిని వారు ×పడిపోని స్వర్ణ×గా కూడా పిలుస్తున్నారు. ఇది వర్షాలు, తుపాన్లకు కూడా తట్టుకుని నిలబడి అధిక దిగుబడి ఇస్తోంది.

నేడు ఎంటీఎస్ టీచర్లకు బదిలీ కౌన్సెలింగ్

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలో పని చేస్తున్న 2008 డీఎస్సీ, 1998 మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సమగ్ర శిక్షా సమావేశ హాలులో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే బదిలీ కౌన్సెలింగ్‌కు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎంటీఎస్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆమె తెలిపారు.

సత్యదేవుని దేవేరికి వజ్రకిరీటం

- రూ.7 కోట్లతో నమూనా ఆలయం, షెడ్ల నిర్మాణ టెండర్లకు ఆమోదం
- శివసదన్‌లో రూ.3 కోట్లతో నిర్మాణాలు
- అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానాలు



ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఈఓ, సభ్యులు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు త్వరలో వజ్రకిరీటాలంకరణలో భక్తులను అనుగ్రహించనున్నారు. రూ.కోటి పైగా వ్యయంతో అమ్మవారికి వజ్రకిరీటం చేయించేందుకు పెద్దాపురం శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీ ఎండీ మట్టే సత్యప్రసాద్ చేసిన అభ్యర్థనకు అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి శుక్రవారం ఆమోదం తెలిపింది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈఓ చంద్రశేఖర్ అజాద్, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్య తీర్మానాలివీ..

- దాత మట్టే సత్యప్రసాద్ గత ఏడాది సత్యదేవునికి వజ్రకిరీటం సమర్పించారు. అదేవిధంగా అమ్మవారికి కూడా ఆరు నెలల్లోగా వజ్రకిరీటం చేయించేందుకు అనుమతించాల్సిందిగా లేఖ రాశారు. స్వామి, అమ్మవార్లకు ఏకకాలంలో వజ్రకిరీటాలు అలంకరించాలని కోరారు. ఆ కిరీటాలకు భద్రత కల్పించాలని కోరారు. దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ నిబంధనల మేరకు అమ్మవారి వజ్రకిరీటానికి అనుమతి ఇచ్చేందుకు ధర్మకర్తల మండలి సమావేశం తీర్మానం.
- దేవస్థానంలో వివాహాలు, ఉపనయనాలు తదితర శుభకార్యాలకు నిర్ణీత రుసుములకు బ్రాహ్మణులను సరఫరాకు సింగిల్ విండో విధానం అమలుపై టెండర్ కం వేలం నిర్వహణ.
- తలనీలాలు పోగు చేసుకుని, తీసుకు వెళ్లేందుకు గత నెల 24న ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిన నిర్వహించిన టెండర్‌లో హెచ్చు పాట రూ.1.35 కోట్లకు ఆమోదం.
- జాతీయ రహదారిపై సత్యదేవ డిగ్రీ కళాశాల వద్ద సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, ఫుడ్ కోర్టు తదితర నిర్మాణాలకు రూ.3.44 కోట్ల అంచనాతో ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ (రెండోసారి) పిలిచారు. దీనిపై రివర్స్ టెండర్, సంప్రదింపుల ద్వారా 3.95 శాతం హెచ్చుతో రూ.3.57 కోట్లకు డీవీ సుబ్బరాజు కొటేషన్ దాఖలు చేశారు. అదే తక్కువ కావడంతో పచ్చజెండా.
- దేవస్థానం జూనియర్ కళాశాల మైదానంలో భక్తులు సేద తీరేందుకు, వంటలు చేసుకునేందుకు, దేవస్థానంలో తూర్పు రాజగోపురానికి ఇరువైపులా గార్డెన్స్‌లో రూ.1.90 కోట్లతో తొమ్మిది షెడ్ల నిర్మాణానికి టెండర్ల ఆమోదం.
- సత్యగిరిపై రూ.15 కోట్లతో 138 గదులతో నిర్మిస్తున్న శివసదన్ సత్రం ముగింపు దశకు చేరింది. ఇందులో ఫ్లోరింగ్, ప్యానల్స్, గదులు, కిటికీలకు కర్టెన్ల వంటి వాటి ఏర్పాటు టెండర్లకు అనుమతి.
- శివసదన్ సత్రానికి రూ.87.75 లక్షలతో జనరేటర్ కొనుగోలుకు టెండర్ ఆమోదం.
- రూ.1.04 కోట్లతో లో టెన్షన్ ప్యానెల్స్ ఏర్పాటు టెండర్‌కు అనుమతి.
- రూ.39.75 లక్షలతో శివసదన్ సత్రం ఆవరణలో కాంక్రీట్ ఫ్లోరింగ్ చేయడానికి, రూ.19.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.9.90 లక్షలతో కర్టెన్ల కొనుగోలు టెండర్లకు ఆమోదం.
- దేవస్థానంలో వివిధ అవసరాల నిమిత్తం మహేంద్ర కంపెనీ ఆథరైజ్డ్ డీలర్ నుంచి రెండు బొలేరో వాహనాల కొనుగోలుకు, విజయవాడకు చెందిన సంస్థ నుంచి రెండు ట్రాలీల కొనుగోలుకు అంగీకారం.
- దేవస్థానం బస్సు టికెట్ల రేట్లు స్వల్పంగా పెంచేందుకు ఆమోదం. రత్నగిరి నుంచి అన్నవరం రైల్వేస్టేషన్‌కు ప్రస్తుతం ఉన్న టికెట్ చార్జీ రూ.15 నుంచి రూ.20కి పెంపు. అలాగే కొండ దిగువ నుంచి రైల్వే స్టేషన్‌కు చార్జీని రూ.10 నుంచి రూ.15కు, కొండ మీద నుంచి దిగువకు రూ.5 నుంచి రూ.10కి పెంపు. తిరుగు ప్రయాణంలోనూ ఇవే రేట్ల వర్తింపు.